క్లుప్తంగా

నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ సంప్రోక్షణ

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మహా సంప్రోక్షణ గురువారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆచార్యవరణం, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం చేపడతారు. శుక్రవారం ఉదయం పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం అగ్నిప్రతిష్ట, కుంభస్థాపన, కుంభారాధన, విశేష హోమం ఉంటాయి. 13న ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, అక్షిణ్మోచనం, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, రత్నన్యాసం, బింబస్థాపన, అష్టబంధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనున్నాయి. సాయంత్రం బింబవాస్తు, నవ కలశ చతుర్ధశ కలశ స్నపనం, మహాశాంతి, తిరుమంజనం, పూర్ణాహుతి, శయనాధివాసం చేపడతారు. చివరి రోజైన 14వ తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. తర్వాత భక్తులకు సర్వ దర్శనం ప్రారంభమవుతుంది.

భక్తులకు అంబలి పంపిణీ



భక్తులకు అంబలి పంపిణీ చేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా నిమ్మకాయల వీధిలో బుధవారం గంగమ్మ చిత్రపటానికి హారతులిచ్చి భక్తులకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్ కుమార్‌రెడ్డి, ఎం ఆర్.రాజా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: ఈనెల 16వ తేదీన జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి ఆవిష్కరించారు.

నేడు మహా కుంభాభిషేకం



భక్తాంజనేయ స్వామి ఆలయం

పాకాల : మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి వీధిలో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా అర్జున తపస్సు



భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె 72వ మహా భారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అర్జున తపస్సు వైభవంగా సాగింది. అరణ్యవాసంలో ఉన్న అర్జునుడు శివుడి కోసం తపస్సు చేసి పాశుపతాస్త్రం సాధిస్తాడు. ఆ ఘట్టాన్ని మహా భారతం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మానును నాటి 18 మెట్లు చెక్కారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ మెట్లను అధిరోహించి అక్కడి నుంచి పూలు, నిమ్మకాయలు, అరటిపండ్లు, విభూది పండ్లు చల్లాడు. ల్లుతాడు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులు కోరిన కొర్కెలు నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం కోసం భక్తులుతపస్సు మాను వద్ద వరపడ్డారు.

ఏఎంపురంలో మాతమ్మ తిరునాళ్ల

సత్యవేడు: మండలంలోని ఏఎంపురంలో బుధవారం మాతమ్మ తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మహిళలు మాతమ్మ గుడికి అంబలి తీసుకువచ్చి పెద్ద పాత్రల్లో పోశారు. సాయంత్రం గెరిగ ఊరేగింపు నిర్వహించారు. మాతమ్మ భక్తులు కాపుకట్టి దీక్ష ప్రాంభించారు. ఆలయం వద్ద సందడి నెలకొంది.

• సంబరం

తిరుపతి గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి సారె సమర్పించారు. మేయర్ శిరీష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత కోలాటం ఆడారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆనందంతో నృత్యం చేశారు. భక్తుల కోలాహలం, కళాకారుల కళా ప్రదర్శనలతో తిరు నగరం హోరెత్తింది. పలువురు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



సారె ఊరేగింపు సందర్భంగా కోలాటం ఆడుతున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత







నృత్యం చేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు, భక్తులకు అన్నదానం



కళాకారుల కళా ప్రదర్శన



సారెకు పసుపు, కుంకుమ నీటితో స్వాగతం పలుకుతున్న మహిళలు

బైరాగి వేషంతో హోరెత్తిన జాతర



బైరాగి వేషంలో చాకలి వంశస్తులు



పిల్లలకు బైరాగి వేషం వేస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమై వెలుగొందుతున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర తొలి రోజు బుధవారం భక్తుల బైరాగి వేషాలతో హోరెత్తింది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఒళ్లంతా విభూది పూసుకుని బొగ్గు బొట్లు పెట్టుకుని మెడ, కాళ్లు, చేతులకు రేల కాయల గజ్జలు కట్టుకుని, నడుముకు వేపాకు కట్టుకుని, చేత వేపాకు పట్టుకుని నగరంలో కేరింతలు కొడుతూ విహరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బైరాగి వేషాల కోలాహలం సాగింది. నగరంలో బైరాగి వేషాలు ధరించిన భక్తులు చిందులు వేస్తూ, బూతులు తిడుతూ, గంగమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం వేషాలమ్మ, తాళ్లపాక గంగమ్మను దర్శించుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి పాదాల వద్ద నృత్యం చేశారు. తర్వాత ఆలయ ప్రదక్షణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా పొంగళ్లు పెట్టారు. కొందరు వెయ్యికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు బండవేషం

జాతరలో భాగంగా రెండో రోజు గురువారం భక్తులు బండవేషంలో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. జాతర సంప్రదాయం ప్రకారం కైకాల వారు బండోళ్ల చిన్నది(స్త్రీ వేషం), చాకలి వారు బండోడు(పురుష వేషం) వేస్తారు. అలాగే స్థానికులు పిల్లలు, పెద్దలు బండవేషాలు వేస్తారు. ఎర్రటి కుంకుమ ఒళ్లంతా పూసుకుని, బొట్లు పెట్టుకుని, బొరుగుల దండలు, బండపూల దండలను మెడకు, చేతికి కట్టుకుని రోకలి, కర్ర చేతపట్టి లయబద్ధంగా శబ్దం చేస్తూ బూతులు తిడుతూ నగరంలో విహరిస్తారు.



కైకాల వంశస్తుల పాముల వేషధారణ



బైరాగి వేషధారణలో చిన్నారులు

వేశాలమ్మకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి సారె



సారెను తీసుకొస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభం సందర్భంగా బుధవారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వేశాలమ్మ తల్లికి సారె సమర్పించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్పీ కార్యాలయం నుంచి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా సారెను తీసుకొచ్చారు. వారికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. సారె సమర్పించి అనంతరం ఎస్పీని ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విమలకుమారి, ఈస్ట్, వెస్ట్ పోలీసు స్టేషన్ల డీఎస్పీ, సీఐలు, పోలీసులు సిబ్బందితోపాటు కార్పొరేటర్ నరసింహ, వైఎస్సార్ సీపీ నేత సునీల్ చక్రవర్తి, మాజీ చైర్మన్ అశోక్ పాల్గొన్నారు. పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ ఇన్‌స్పెక్టర్ దీపక్‌కుమార్

తిరుపతి మంగళం: జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని విజయవాడకు చెందిన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్ పదవ బెటాలియన్ అండర్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ తెలిపారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ సచివాలయ ప్రాంగణంలో బుధవారం స్థానికులకు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో మానవ తప్పిదాలతో ప్రమాదాలు, భూకంపం, గుండెనొప్పి వచ్చినప్పుడు ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చు, ఏదైనా ప్రమాదాలు జరిగి రక్త గాయాలైనప్పుడు రక్త స్రావం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితరాలను వివరించారు. అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు అడవులలో మంటలు ఏర్పడినప్పుడు ఎలా మెలగాలని విషయాలను వివరించారు. అంతే కాకుండా మనుషులు మంచి ఆలోచనలతో చేసే పనులు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, ఎంఈవో ప్రభాకరరాజు, తిరుమలనగర్ పంచాయతీ ఇన్‌చార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, వీఆర్వోలు భూపతి ఆచారి, శంకరయ్య, సచివాలయ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

హిందూ మతం పరిరక్షణే శ్రీరామసేన లక్ష్యం



హిందూ మత పరిరక్షణ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సరస్వతి, శ్రీరామసేన ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: దేశంలో హిందూ మతం, హిందూ దేవాలయాల పరిరక్షణే లక్ష్యంగా శ్రీరామసేన పని చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.జనార్ధన్ తెలిపారు. యూత్ హాస్టల్లో బుధవారం హిందూ మతం, హిందూ దేవాలయాల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ డెప్యూటీ సెక్రటరీ చిల్డ్రన్ ఫ్యామిలీ ఇష్యూస్, నేషనల్ కన్జ్యూమర్ రైట్ కౌన్సిల్ పీఆర్‌వో సరస్వతి హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జనార్ధన్ మాట్లాడుతూ దేశంలో హిందూ మతంలో పుట్టిన ప్రతి బిడ్డా హిందూ మతాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది ఇతర మతాల వైపు చూడడం బాధాకరమన్నారు. దేశంలోని హిందూ ఆలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి పరిరక్షణ కోసం శ్రీరామసేన పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి వెళ్లి హిందూ మతం గొప్పతనంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీరామసేన కార్యదర్శి కేఎస్.లత, ఉపాధ్యక్షురాలు భారతి పాల్గొన్నారు.

గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి

తొట్టంబేడు(రేణిగుంట): గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ వి.భీమారావు తెలిపారు. కాకినాడ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్పందన సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు ప్రారంభం

• నేడు స్వర్ణ రథోత్సవం



స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. సాయంత్రం స్వామి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు స్వర్ణ రథోత్సవం

వసంతోత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం స్వామి వారి స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. వసంతోత్సవాల సందర్భంగా ఆలయంలో కల్యాణోత్సవం, అష్టోత్తర శతకలశాభిషేకం, తిరుప్పావడ సేవలను రద్దు చేశారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్ పాల్గొన్నారు.

లూపస్ వ్యాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.దామోదరం

తిరుపతి తుడా: ఈఎస్ఐ ఆసుపత్రిలో బుధవారం లూపస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ లూపస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక శుభోదయ రుమటాలజీ ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.దామోదరం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా యువతుల్లో కనిపిస్తాయన్నారు. శరీరంపై సీతాకోక చిలుక ఆకారంలో మచ్చలు ఏర్పడడం, రెండు, మూడు వారాలు జ్వరం, కీళ్ల నొప్పులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. జన్యుపరమైన, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం తదితర కారణాలతో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్, స్పెషలిస్ట్ డాక్టర్ రమేష్ కుమార్, స్థానిక వైద్య నిపుణులు పి.రెడ్డెప్ప, నర్సింగ్ సూపరింటెండెంట్ సి.అమ్ములు, వికాస్ నర్సింగ్ కాలేజీ అధ్యాపకురాలు నాగసుప్రియ, హ్యూమన్ రైట్స్ మహిళా శాఖ జిల్లా ప్రతినిధి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

విజయవాడ: నిద్రమాత్రలు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన డి.రామయ్య నాయుడు(74) గత నెల 18వ తేదీన బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. 22న రాత్రి 12.30 గంటల సమయంలో రూమ్‌లో లైట్లు వెలుగుతుండడంతో లాడ్జి సిబ్బంది రూమ్‌లోకి వెళ్లి చూశారు. రూమ్‌లో మంచం మీద పడి ఉండి నోటి నుంచి నురగ వస్తుండాన్ని గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది నిద్రమాత్రలు మింగినట్లు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘గౌడగారి అమ్మాయి’ విజయం సాధించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): విజయ రాసన్, విమలశ్రీ హీరోహీరోయిన్‌లుగా దర్శకుడు పూరి కేదార్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గౌడగారి అమ్మాయి షార్ట్ ఫిలిం ప్రేక్షకుల మన్ననలు పొంది విజయం సాధించాలని తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఆయన బుధవారం షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కేరళలో రిలీజైన విస్పరసస్ అనే షార్ట్ ఫిల్మ్‌కు ఆస్కార్ అవార్డు సైతం వచ్చినట్లు గుర్తు చేశారు. వైవిధ్యమైన కథతో గౌడగారి అమ్మాయి అనే షార్ట్ ఫిల్మ్ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. జూన్ 10న రిలీజు కానున్న షార్ట్ ఫిల్మ్‌ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మాత మహేష్ గౌడ్, కెమెరామెన్ పురంధర్, ఎడిటర్ ప్రసాద్, ఎంపీటీసీ యోగానంద రెడ్డి, వార్డు సభ్యుడు మునీంద్ర రాయల్, సీపీఎం నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, వాసు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక సమైక్యత

తిరుపతి కల్చరల్: ఆనాటి కాలమాన రాజకీయ పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తి భావాన్ని చైతన్య పరిచి, సమాజంలో నైతిక విలువలను పునరుద్ధరించేందుకు అన్నమయ్య కీర్తనలు దోహదపడినట్లు ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కట్టమంచి మహాలక్ష్మి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న అన్నమయ్య జయంతి ఉత్సవాలు బుధవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆమె అన్నమయ్య-నైతికత అనే అంశంపై మాట్లాడారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అన్ని వృత్తుల వారు సమానమేనని, రాజు–పేద తేడా ఉండకూడదని తెలిపారని పేర్కొన్నారు. ఆశ్రమ ధర్మాల్లో గృహస్తాశమం గొప్పదని వివరించారని తెలిపారు. విజయవాడకు చెందిన డి.రామకృష్ణ అన్నమయ్య సంస్కృత కీర్తనలు అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య అలతి అలతి పదాలతో సంస్కృతంలో సుమారు 90 సంకీర్తనలను రచించినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత జి.బసవ శంకరరావు అన్నమయ్య -నవ్య కీర్తనలు అనే అంశంపై ప్రసంగిస్తూ 500 ఏళ్ల క్రితం నాటి అన్నమయ్య సాహిత్యంలో నాటి వైభవాన్ని, సామాజిక జీవనాన్ని అద్భుతంగా వర్ణించారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదనరావు బృందం సంగీత గానం, మునిలక్ష్మి బృందం హరికథా గానం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.